## క్లుప్తంగా

### ఎరువుల దుకాణాల తనిఖీ



పమిడిముక్కల: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాలను అధికారులు సోమవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ నవీన్ కుమార్, ఏఓ గణేష్‌రెడ్డి దుకాణాలకు వెళ్లి రికార్డులు తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు ఉన్నయో, లేవో పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మినా, యూరియా నిల్వ చేసినా చర్యలు తీసుకొంటామని డీలర్లను హెచ్చరించారు.

### లక్ష్మి కుటుంబానికి రూ.25 వేల సాయం

పెదపూడి(మొవ్వ): కూచిపూడి వాసవీ వనిత క్లబ్ సభ్యురాలిగా కొనసాగుతూ ఇటీవల వికలాంగుల పింఛన్ రద్దయిందనే మనోవ్యాధితో గత వారంలో మరణించిన మేడం లక్ష్మి కుటుంబ సభ్యులకు క్లబ్ తరఫున రూ.25వేలను సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఐపీసీ ఇండోర్ సురేష్, ఆర్ఎస్ అన్నం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### వినాయక విగ్రహాల పంపిణీ



మండవల్లి: మండలంలోని భైరవపట్నంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల ప్రకారం 30 వినాయక విగ్రహాలను గ్రామంలోని ఎన్డీఏ పార్టీ కార్యాలయంలో సోమవారం దాతలు చాపరాల దుర్గాప్రసాద్, చాపరాల నాగేశ్వరరావు, సజ్జా సురేష్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని 29 గ్రామాలకు విగ్రహాలను అందజేశారు.

### మురుగు కాలువల్లో చేప పిల్లల వదిలివేత

కూచిపూడి(మొవ్వ): డెంగీ, మలేరియా నివారణలో భాగంగా ఐదువేల గాంబూసియా చేప పిల్లలను మొవ్వ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి పర్యవేక్షణలో సోమవారం మురుగు కాలువల్లో వదిలారు. పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లో ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో దోమల లార్వా ఎక్కువగా ఉన్న నిల్వ (మురుగు)నీటిలో గాంబూసియా చేప పిల్లలను వదిలారు. తొలుత కూచిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కే రామాంజనేయులు, సీహెచ్ఓ దివ్య, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

### చెత్త సంపద కేంద్రం పరిశీలన



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా ఎస్‌బీఎం రీసోర్స్ ఇన్వెస్టిగేటర్ జి.సుధీర్ పరిశీలించారు. షెడ్డులో ప్లాస్టిక్ షట్టర్ పనితీరును పరిశీలించారు. గ్రామంలోని సేకరించిన పాత ప్లాస్టిక్ గ్లాసులు, బాటిల్స్‌ను ఈ మిషన్ ద్వారా చిన్న ముక్కలుగా చేయవచ్చు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని హరిత రాయబారుల నుంచి తెలుసుకొన్నారు.

### అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం వితరణ

కైకలూరు: అంగన్‌వాడీ చిన్నారులకు రెండు జతల బట్టలను కుట్టించి పంపిణీ చేసిన దాతలు అభినందనీయులని అంగన్‌వాడీ టీచర్లు పి.సుజత, వి.మణికంత పేర్కొన్నారు. గోపవరం గ్రామానికి చెందిన కనుమూరి పాండురంగరాజు గ్రామంలోని రెండు అంగన్‌వాడీ సెంటర్లలో 35 మంది చిన్నారులకు రెండు జతల బట్టలు సోమవారం అందించారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ ఉలిసి వసంత కుమారి నాలుగు కుర్చీలు అందజేశారు. యూపీ పాఠశాల హెచ్ఎం దానం ప్రసాద్, ఉపాధ్యాయులు పి.శాంతి, ఫణికుమార్ పాల్గొన్నారు.

### చాలీచాలని జీతాలతో రోడ్డున పడుతున్నాం

కైకలూరు: చాలీచాలని జీతాలతో అదనపు పని భారంతో సతమతమవుతున్నామని కైకలూరు మండల వీఆర్ఏలు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీంకు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం వీఆర్ఏలు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పార్ట్ టైమ్‌గా చేరి ఫుల్ టైమ్ వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. నెలకు రూ. 10,500 మాత్రమే గౌరవ వేతనంగా అందుతుందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పోల్చుకుంటే ఏ మాత్రం జీతం సరిపోవడం లేదన్నారు. జీతాలు పెంచక, ఉద్యోగోన్నతులు రాక తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు వచ్చాయన్నారు. ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీఆర్ఏలు బలే రాజశేఖర్, దొడ్డాకుల కరుణాకర్, కొమ్మిన బాబీ, కొండపల్లి ప్రేమ్‌చంద్, రామిశెట్టి అక్షేష, మత్యాల అనిత, నీలపాల శిరిషా, తేరా చిన్నారి పాల్గొన్నారు.

# పక్కదారి పడుతున్న యూరియా!

- వ్యవసాయేతర పనులకు వాడకం
- యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు



కొతవరంలో యూరియా కోసం రైతుల ఎదురు చూపులు (ఫైల్)

గుడ్లవల్లేరు: వ్యవసాయేతర అవసరాలకు యూరియా వాడకం అధికం కావడంతో యూరియాను పక్కదారి పట్టిస్తున్నారు. యూరియాను ప్రధానంగా వ్యవసాయంలో పంటలకు నత్రజని అందించే ఎరువుగా వినియోగిస్తారు. ఇది పంటల ఎదుగుదలకు, ఆకుల పచ్చదనానికి దోహదపడుతుంది. దీనిని పశుగ్రాసం, ప్లాస్టిక్, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ వంటి పారిశ్రామిక ఉత్పత్తుల తయారీకి ముడి పదార్థంగా కూడా ఉపయోగిస్తారు. ఇలాంటి వాడకాలతో యూరియా పక్కదారి పడుతుందనే ఆరోపణలున్నాయి. వ్యవసాయంలో నత్రజని ఎరువుగా దీనిని వాడతారు. యూరియాలో 46 శాతం నత్రజని మొక్కలకు అవసరమైన పోషకంగా ఉపకరిస్తోంది. పంటల్లోని మొక్కల ఆకుల పెరుగుదలను ప్రోత్సహించి యూరియా పచ్చగా ఉండేలా దోహదపడుతుంది.

**పారిశ్రామిక ఉత్పత్తులకు ఉపయోగం**

యూరియాను ప్రస్తుతం పారిశ్రామిక ఉత్పత్తులకు ఉపయోగించటంతో రైతులకు కృత్రిమ కొరత ఏర్పడిందనే వాదనలు వస్తున్నాయి. ప్లాస్టిక్స్, రసాయనాలు, మందులు వంటి అనేక పారిశ్రామిక ఉత్పత్తుల తయారీలో యూరియా ముడి పదార్థంగా ఉపయుక్తమవుతుంది. పశువుల దాణా పోషకాలతో కూడిన పశువుల దాణా తయారీలో కూడా యూరియాను వినియోగిస్తారు. చర్మ సంరక్షణ ఉత్పత్తుల్లో సైతం యూరియా వినియోగం అధికమవుతుంది. పొడి, కఠినమైన, పొలుసుల చర్మాన్ని అతి మృదువుగా చేయడానికి కొన్ని చర్మ సంరక్షణ ఉత్పత్తులలో యూరియాను తయారీదారులు వాడుతున్నారు. ఇవన్నీ యూరియా కొరతకు ప్రధాన కారణాలుగా బాధిత రైతులు ఆరోపిస్తున్నారు.

**నల్లబజార్లకే పరిమితం**

నల్లబజార్లకే పరిమితమైన యూరియాను అధిక ధరలకు రైతులకు దళారులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులకు రైతులు తమగోడును విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో దళారులే రాజ్యమేలుతున్నారు. రైతన్నకు ఒక్కో కట్ట రూ.350 నుంచి రూ.500 వరకు నల్లబజార్లలో అమ్ముతున్నారు. దీంతో ఒక్కో యూరియా కట్టకు రూ.235 రైతన్నకు వాత పడుతుంది. అసలు ఎమ్మార్పీ రూ.265.50లే ఉంది.

**లారీల కొద్దీ ఎత్తేస్తున్న బడాబాబులు**

పీఏసీఎస్‌లకు ఎప్పటికపుడు చేరిన యూరియాను బినామీల పేరిట అందిన కాడికి లారీల కొద్దీ టీడీపీకి చెందిన బడాబాబులు ఎత్తేసుకుని తరలించి, బ్లాక్ చేసుకుంటున్నారు. చిన్న రైతులు అడిగితే యూరియా అయిపోయింది గాని ఒక అరకట్ట ఇస్తాం... తీసుకెళ్లమని రైతులకు పీఏసీఎస్‌ల సిబ్బంది చెబుతున్నారు. వీరికి సంబంధితాధికారులు కొందరు సహకరిస్తూ.. తిలాపాపం తలా పిడికెడు అంటూ కమీషన్ల కక్కుర్తితో కాసులు దండుకుంటున్నారు. అటు కాసులు రావటంతో పాటు ఇటు బదిలీలు ఆగుతున్నాయనే ఉద్దేశంతో వీరి మనుగడ సాగిపోతుందని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కృత్రిమ కొరతపై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ గ్రామ గ్రామాన జిల్లాలో నిరసనలు చేస్తోంది.

### రైతు సంక్షేమం గాలికి...



యూరియా కట్టలు

కూటమి ప్రభుత్వ పాలనలో రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసి అందిన కాడికి దోచుకునే వారిదే రాజ్యంగా మారింది. అది రాజకీయ నేతలే గాక కొందరు ఎరువుల దుకాణదారుల నుంచి అధికారుల వరకూ కూడా వర్తిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో యూరియా కృత్రిమ కొరత అధికమైంది. ఈ కారణంగా జిల్లాలో సాగవుతున్న 1.67 లక్షల హెక్టార్ల ఖరీఫ్ వరి సాగులో ముఖ్యంగా వాడాల్సిన యూరియా సమస్య రైతన్నకు తలనొప్పిగా మారింది. జిల్లాకు 36 వేల టన్నుల యూరియాను జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టింది. ఇప్పటికి కేవలం సొసైటీలు, వ్యాపారుల ద్వారా సుమారు 24వేల టన్నులే మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు సరఫరా అయినట్లు అధికారక లెక్కలు చెబుతున్నాయి.

### యూరియా లేకపోతే దిగుబడి రాదు



వరిసాగుకు యూరియా అందించలేకపోతే దిగుబడి తగ్గుముఖం పడుతుంది. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులకు అవసరమైన యూరియాను వెంటనే అందించేందుకు తగు చర్యలను తీసుకోవాలి.

– పెన్నేరు ప్రభాకరరావు, వడ్లమన్నాడు రైతు క్లబ్ కన్వీనర్

### రైతులందరినీ సమానంగా చూడాలి



ప్రభుత్వం రైతులందరినీ సమానంగా చూడాలి. అంతేగాని ఒక సన్నకారు రైతుకి వచ్చేసరికి అర బస్తా యూరియా ఇస్తున్నారు. 25 బస్తాల యూరియా కట్టలను రాజకీయ నాయకుల ఇంటికి పంపుతున్నారు. అలా మా చుట్టుపక్కలున్న అన్ని గ్రామాల్లో చేయటంతో రైతుల్లో వ్యతిరేకత వస్తోంది.

– అడపా గోపాలకృష్ణ, వడ్లమన్నాడు రైతు

## గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి



కోడూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోడూరులో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, మంచినీటి చెరువు నూతన ఫెన్సింగ్, గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలను దశల వారీగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.

**సాంకేతిక పద్ధతులు ఉపయోగించాలి**

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు అవలంబించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కోరారు. స్థానిక జేఎల్‌జీ గ్రూపునకు ప్రభుత్వం సబ్సిడీపై అందించిన కిసాన్ డ్రోన్‌ను ఎమ్మెల్యే గ్రూపు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నానో రూపంలో ఉన్న ఎరువులను డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే సమయం, వ్యయం ఆదా అవుతాయన్నారు. ఏడీఏ జి.వెంకటమణి మాట్లాడుతూ నానో ఎరువుల వలన పర్యావరణాన్ని సంరక్షించుకోవడంతో పాటు అధిక దిగుబడులు పొందొచ్చన్నారు. ఏఓ బి.వేణుమాధవ్, కూటమి నాయకులు శోభనాద్రిచౌదరి, చలమయ్య పాల్గొన్నారు.

### విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు

పమిడిముక్కల: విద్య ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, తమ పిల్లలను తప్పక చదివించుకోవాలని డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ ఎండీ వసంతకుమారి తల్లిదండ్రులకు సూచించారు. పమిడిముక్కల ఎస్టీ కాలనీలోని పిల్లల తల్లిదండ్రులకు చదువు వల్ల కలిగే ప్రయోజనాలను సోమవారం వివరించారు. కార్యక్రమంలో వలంటీర్ కాగిత హమీకా పాల్గొన్నారు.

### కైకలూరును కృష్ణా జిల్లాలో చేర్చాలి

ముదినేపల్లి రూరల్: కై కలూరు నియోజకవర్గాన్ని మచిలీపట్నం కేంద్రంగా కృష్ణా జిల్లాలో చేర్చాలని స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రివర్గ ఉప సంఘానికి, జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంగా ఏలూరు కన్నా మచిలీపట్నం దగ్గరగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. డివిజన్ల పరంగా గుడివాడ, మచిలీపట్నం దగ్గరగా ఉంటాయని ఏలూరు దూరంగా ఉంటుందని తెలిపారు. గ్రామసర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిమ్మగడ్డ భిక్షాలు, పూలే కమిటీ అధ్యక్షుడు పళ్లెం పుణ్యేశ్వరరావు, కార్యదర్శి జేవీ వెంకటేశ్వరరావు, కోశాధికారి ఈడే శ్రీనివాసరావు, సభ్యులు సోమల వరప్రసాద్, ఎండీ రియాజ్ పాల్గొన్నారు.

## రైతు ఉత్పాదక సంఘాల సభ్యత్వం పొందాలి

మొవ్వ: రైతు ఉత్పాదక సంఘాలలో రైతులందరూ సభ్యత్వం పొందాలని ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి రైతులకు సూచించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాలలో సోమవారం మొవ్వ రైతులకు రైతు ఉత్పాదక సంఘాల ప్రాముఖ్యతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో రైతుల ఐకమత్యం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ రైతు ఉత్పాదక సంఘాల దరఖాస్తు చేసుకునే వివరాలు, రైతు ఉత్పాదక సంఘాలను ఏర్పాటు చేయడంలో రైతులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### 274 ఎరువుల బస్తాల సీజ్

నిడుమోలు(మొవ్వ): మొవ్వ మండల వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా నిడుమోలు గ్రామంలోని సుమేధ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణంలో సోమవారం తనిఖీలు నిర్వహించి 274 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. ఎరువుల నమోదు రిజిస్టర్‌కు గ్రౌండ్ బ్యాలెన్స్‌లో అధికంగా ఉండటంతో అధికంగా ఉన్న బస్తాలను సీజ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి బి.సురేష్ బాబు నాయక్ విలేకరులకు తెలిపారు. విజిలెన్స్ డీఎస్పీ బంగారు రాజు, ఏఓ నిర్వహించిన ఈ తనిఖీల్లో రూ 2,91,250 విలువ గల అమోనియం సల్ఫేట్ 192 బస్తాలు, మూడు 15ల కాంప్లెక్స్ 82 బస్తాలు సీజ్ చేశామని పేర్కొన్నారు.

### అన్నదాతల అభ్యున్నతికి కృషి

గుడ్లవల్లేరు: అన్నదాతల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం వెణుతురుమిల్లి పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసి నూతన కమిటీ సభ్యులను అభినందించారు. కమిటీ చైర్మన్‌గా కొప్పినేని పిచ్చేశ్వరరావు, డైరెక్టర్లుగా కట్టా శ్రీనివాసరావు, అల్లూరి బుజ్జి బాబు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్య చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**గుడివాడలో..**

గుడివాడరూరల్: రైతాంగ సంక్షేమానికి నూతనంగా నియమితులైన పీఏసీఎస్‌ల కమిటీలు సహకరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని దొండపాడు గ్రామ పీఏసీఎస్ కమిటీల ప్రమాణస్వీకారోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే పాల్గొని కమిటీ సభ్యులను అభినందించారు. సొసైటీ చైర్మన్‌గా మనునూరి రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లుగా మట్టా కాంతారావు, ఉప్పులూరి శోభనాద్రితో ప్రమాణస్వీకారం చేయించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### సంక్షిప్త వార్తలు

**కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి**

గుడ్లవల్లేరు: కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మండలంలో ట్రాక్టర్లతో అన్నదాత సుఖీభవ భారీ విజయోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించారు. అనంతరం కౌతవరం వాటర్ వర్క్స్ వద్ద నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు.

**సహకార వ్యవస్థను బలోపేతం చేస్తాం**

గుడ్లవల్లేరు: సహకార వ్యవస్థను బలోపేతం చేస్తామని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. సోమవారం రాత్రి కౌతవరం పీఏసీఎస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన ఆయన మాట్లాడారు. కేవలం రైతు రుణాలే గాక వారి కుటుంబాల్లో పిల్లల చదువులు, వ్యాపారాల వంటి వివిధ రంగాలకు కూడా తమ బ్యాంక్ అందుబాటు వడ్డీలతో రుణాలను అందిస్తోందన్నారు. అనంతరం ఆయన్ను నూతన పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్ల మూడి యుగంధర్, సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానించారు.


**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

ముదినేపల్లి రూరల్: మానవాళి మనుగడకు సహకరించే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చిగురుకోటలో స్థానిక సెంటినీ సెరామిక్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు సోమవారం పంపిణీ చేశారు. సెంటినీ సెరామిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**28న హుండీ కానుకుల లెక్కింపు**

పామర్రు(మొవ్వ): పామర్రు మండల పరిధిలో ఉండ్రపూడి, పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 28వ తేదీ స్వామి వారి హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ అధికారి ప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జరిగే ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ గుడివాడ అధికారులు, ఆలయ అధికారులు, భక్తుల సమక్షంలో లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

### బాల్య వివాహాలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

కలిదిండి(కై కలూరు): బాల్య వివాహాలను సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా అడ్డుకోవాలని కై కలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి పిలుపునిచ్చారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోరుకొల్లు పంచాయతీ కార్యాలయం వద్ద 'బాల్య వివాహాలు–పరపక్వత చెందని గర్భాధరణ' అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జీ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేస్తే రెండేళ్ల శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, పి.ప్రసన్నకుమార్, న్యాయవాదులు సీహెచ్.నాగేశ్వరరావు, సునీత, గౌతమి, డి.మేరి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## చవితికి గణనాథుల ముస్తాబు



నాగవరప్పాడు వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథుని విగ్రహాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బాల గణపతి విగ్రహాలు

గుడివాడరూరల్: వినాయక చవితి వేడుకలకు గుడివాడ పట్టణంలోని నాగవరప్పాడు ప్రధాన సెంటర్‌లో అమ్మకాలకు ముస్తాబైన గణనాథులు కొలువుదీరారు. జిల్లాతో పాటు పక్క జిల్లాల్లో వినాయకుడి విగ్రహాల తయారీకి పేరొందిన గ్రామాల్లో గత ఆరు నెలల నుంచి వినాయకుని విగ్రహాలను తయారీ చేస్తారు. ప్రస్తుతం కార్యక్రమంలో తయారీదారులు నిగమ్నమయ్యారు. ప్రతి ఏటా గుడివాడ నియోజకవర్గంతో పాటు పెదపారుపూడి, ముదినేపల్లి, పామర్రు, ఉంగుటూరు తదితర మండలాల్లోని గ్రామాలకు ఇక్కడ నుంచే అధిక శాతం విగ్రహాలను తీసుకెళ్తారు. ఐదు అడుగుల నుంచి 10 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారీదారులు సిద్ధం చేశారు. వివిధ రకాల రూపాల్లో ఉన్న విగ్రహాలను పట్టణంలోని నాగవరప్పాడు సెంటర్‌లో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. విగ్రహాలను కొనుగోలు చేసేందుకు భక్తులు, కమిటీ సభ్యులు ఉత్సాహం చూపుతున్నారు.

## మట్టి వినాయక విగ్రహాలే మేలు



గుడివాడలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న హరికుమార్‌యాదవ్, ట్రాఫిక్ ఏఎస్ఐ భాగ్యవతి

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను భక్తులు ఉపయోగించాలని శ్రీకృష్ణయాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టైలరింగ్ స్ట్రీట్‌లో ట్రాఫిక్ ఏఎస్ఐ భాగ్యవతి సహకారంతో 300 మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నేత బొగ్గరపు తిరుపతయ్య, నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వరరావు, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, జాజుల మునీంద్ర, బత్తుల ప్రసాద్, కె.సతీష్, గంప శ్రీనివాస్, జాజుల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజం

**డీఎస్పీ ధీరజ్ వినీల్**



స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించిన డీఎస్పీ వినీల్

గుడివాడరూరల్: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నందమూరి తారకరామారావు మెమోరియల్ నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించనున్న అండర్–14,16 అథ్లెటిక్స్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత క్రీడాకారులతో కలిసి ఆటలు ఆడారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో 350 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సెక్రటరీ కిలారపు రంగప్రసాద్, కమిటీ సభ్యులు భవానీప్రసాద్, సాంబశివరావు, ప్రసాదరావు, ఆయా పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



దోకిపర్రులో స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న శివప్రసాద్



పామర్రులో స్మార్ట్ కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



కౌతవరంలో స్మార్ట్ కార్డులను ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే

పమిడిముక్కల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులను సోమవారం కార్డుదారులకు అందజేశారు. వీరంకిలాకు షాపు నంబర్ 18లో కార్డుదారులకు తహసీల్దార్ నవీన్‌కుమార్, సర్పంచ్ సునీత, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ రమేష్, ఉప సర్పంచ్ ఇమడాబత్తుల వెంకటేశ్వరరావు, నాయి బ్రాహ్మణ సమితి జిల్లా అధ్యక్షుడు ఆముదాలపల్లి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరులో..**

గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రులో స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. డోకిపర్రు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వీరమాచనేని శివప్రసాద్, పంచాయతీ సర్పంచ్ గోసాల జ్యోతి, నీటి సంఘం ప్రెసిడెంట్ వీరమాచనేని నాగ జయరాం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ టి.నాగలక్ష్మి పాల్గొన్నారు

**పామర్రులో..**

పామర్రు(మొవ్వ): పామర్రులో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కుమార్ రాజా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డ్ ద్వారా మూడు విధాలుగా ఒకటి వేలిముద్ర వేసి, రెండవది ముఖ నిర్ధారణ ద్వారా, మూడవది ఫోన్ నంబర్ ఓటీపీ ద్వారా రేషన్ తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికాంత్, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**మొవ్వలో..**

మొవ్వ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, తహసీల్దార్ కే మస్తాన్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మండవ రత్నగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

**స్మార్ట్ రేషను కార్డుల ఆవిష్కరణ**

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ బి.లోకరాజు పాల్గొన్నారు

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ వరకుమార్ సోమవారం తెలిపారు. పెదపారుపూడి, చినపారుపూడి, ఈదులమద్దాలి, జువ్వనపూడి, అప్పికట్ల గ్రామాల్లో చెట్లు కొమ్మలు కొట్టేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.